క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో లక్ష రుద్రాక్ష పూజ



రుద్రాక్షలతో పూజ అందుకున్న స్వామివారు

తాళ్లరేవు: పాతకోరంగిలోని బాలా త్రిపుర సుందరి సమేత కురంగేశ్వర స్వామి వారికి బుధవారం లక్ష రుద్రాక్ష పూజను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పవిత్ర మాస శివ రాత్రి సందర్భంగా లోక కల్యాణార్థం ఈ పూజ నిర్వహించినట్లు ఆలయ అర్చకులు కొత్తలంక రామకృష్ణ సాయి ప్రసాద్ తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

15న సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

ఐ.పోలవరం: మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయంలో శ్రావణ మాసం సందర్భంగా సామూహిక ఉచిత వరలక్ష్మి వ్రతాలు శుక్రవారం నిర్వహిస్తున్నట్టు ఆలయ చైర్మన్ పెన్మత్స వాసురాజు, ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. దేవదాయ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆలయ పురోహితులు నాగాభట్ల రామకృష్ణమూర్తి, అర్చకుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఆ రోజు మహిళలు ఉదయం 8 గంటలకే ఆలయానికి రావాలని తెలిపారు.

వైద్య ఖర్చులకు ఎఫ్-3 సాయం



పల్లాలమ్మకు సొమ్ము అందిస్తున్న ఎఫ్ 3 గ్రూపు స్నేహితులు

అమలాపురం టౌన్: అమలాపురం ఫ్రెండ్స్ ఫర్ ఫీడింగ్ (ఎఫ్-3) పేరిట కొందరు స్నేహితుల బృందం ఏర్పాటు చేసుకున్న వాట్సాప్ గ్రూపు ద్వారా సేకరించిన విరాళాలతో వైద్యం చేయించుకోలేక ఇబ్బంది పడుతున్న పేదలకు తమ వంతు సాయం అందిస్తున్నారు. అమలాపురం రూరల్ మండలం బండార్లంకకు చెందిన ములుకు పల్లాలమ్మ పక్షవాతంతో బాధ పడుతోంది. భర్త లేని ఆమె అద్దె ఇంట్లో తన కొడుకు, కోడలతో ఉంటోంది. ఆమె వైద్య ఖర్చుల కోసం ఎఫ్-3 గ్రూపు స్నేహితులు సేకరించిన రూ.16,700 మొత్తాన్ని ఆ కుటుంబానికి అందించారు. పల్లాలమ్మ అవసరాన్ని, అవస్థలను గుర్తించిన ఎఫ్-3 వ్యవస్థాపకుడు పఠాన్ జానీ ఆధ్వర్యంలో గ్రూపు సభ్యులు బుధవారం రాత్రి బండార్లంకలోని పల్లాల్లమ్మకు సొమ్ము అందజేశారు.

గ్రామాన్ని దత్తత తీసుకోవాలి

అల్లవరం: బోడసకుర్రు గ్రామంలో చమురు నిక్షేపాలను వెలికితీస్తున్న ఓఎన్జీసీ, గెయిల్ సంస్థలు గ్రామాన్ని దత్తత తీసుకుని మౌలిక సౌకర్యాల కల్పించాలని కోరుతూ సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి అధ్యక్షతన బుధవారం పంచాయతీ తీర్మానం చేశారు. ప్రజలకు అవసరమైన విద్య, వైద్యం, తాగునీరు, రోడ్లు, డ్రైన్లు, వీధిదీపాలకు నిధులు కేటాయించాలని వారు కోరారు. పంచాయతీ తీర్మానాన్ని కలెక్టర్, ఓఎన్జీసీకి సమర్పించి నిధులు మంజూరు చేయాలని కోరుతామని సర్పంచ్ విజయలక్ష్మి తెలిపారు.

రైతులకు ప్రయోజనం చేకూరేలా ప్రణాళికలు

అల్లవరం: ఉపాధి హామీ పథకంలో చేపట్టే పనులు వ్యవసాయానికి అనుబంధగా, రైతులకు ప్రయోజనం చేకూరేలా ప్రణాళికలు ఉండాలని మండల అభివృద్ధి అధికారి కృష్ణమోహన్ అన్నారు. అల్లవరంలోని ఉపాధి కార్యాలయంలో ఏపీఓ శ్రీనుబాబుతో కలసి బుధవారం ఉపాధి పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ఉపాధి పనుల ప్రణాళిక తయారు చేసేటప్పుడు ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన ఉపాధి కూలీలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పని దినాల కల్పనలో సున్నా పురోగతి ఉంటే సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

సమీకృత వ్యవసాయ క్షేత్రం పరిశీలన

తాళ్లరేవు: చొల్లంగి రైతు భరోసా కేంద్రం ద్వారా కట్టిమేను నూకరాజు అనే రైతు నిర్వహిస్తున్న సమీకృత వ్యవసాయ క్షేత్రాన్ని బుధవారం జిల్లా వ్యవసాయాధికారి ఎస్.విజయకుమార్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రతిరైతు కూడా ఈ విధానాన్ని అమలు చేస్తే వరితోపాటు ఇతర పంటల్లో అధిక దిగుబడి పొందవచ్చన్నారు. 1.50 ఎకరాలకు గానూ 80 సెంట్లలో వరిసాగు, 20 సెంట్లలో చేపలు, బాతులు పెంపకం, 10 సెంట్లలో కాలువపై నాటుకోళ్ల పెంపకం, 20 సెంట్లలో కూరగాయలు, ఆకుకూరలు సాగు చుట్టూ గట్లపై కరివేపాకు, మునగ, మొక్కజొన్న, అరటి తదితర పంటల పండించి లాభాలు ఆర్జించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో కరప సబ్ డివిజన్ ఏడీ కె.బాబూరావు, ఏఓ ఎన్.ప్రశాంతి, పద్మజ, వీఏఏ వెంకటరమణ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికం.. ఇంటికే పథకం

- సంక్షేమ పథకాలు అందిస్తున్న ప్రభుత్వం
- నూతన పింఛన్ల పంపిణీతో సందడి
- అమలాపురం మున్సిపాలిటీకి మంజూరైన 225 కొత్త పింఛన్లు



కొత్త పింఛన్లను అందజేస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్

అమలాపురం టౌన్: రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన లబ్ధిదారులందరికీ సంక్షేమ పథకాలను తలుపులు తట్టి మరీ అందిస్తోంది. అర్హత ఉండి దరఖాస్తు చేసుకున్న వారికి పింఛన్లు మంజూరు చేసింది. నూతన పింఛన్ల పంపిణీతో గ్రామాలు, మున్సిపాలిటీల్లో సందడి నెలకొంది. అమలాపురం మున్సిపాలిటీకి కొత్తగా 225 పింఛన్లు మంజూరయ్యాయి. ఆయా వార్డుల్లో కౌన్సిలర్లు లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. పట్టణంలో ఇప్పటి వరకూ ఉన్న 4,512 పింఛన్లకు తోడు కొత్తగా మంజూరైన 225 కొత్త పింఛన్లు తోడయ్యాయి. వీరికి ప్రతి నెలా ఒకటో తేదీన పట్టణానికి సంబంధించి దాదాపు రూ.1.26 కోట్లు లబ్ధిని పింఛన్ల రూపంలో అందుతోంది. మున్సిపాలిటీలో 26వ వార్డులో కౌన్సిలర్ యండమూరి గంగ, 19వ వార్డులో ఆ వార్డు వైఎస్సార్ సీపీ కన్వీనర్ చిక్కాల రవిశంకర్, 28 వార్డులో కౌన్సిలర్ గోపీ రాజీ, 16వ వార్డులో కౌన్సిలర్, పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, 27వ వార్డులో వార్డు కౌన్సిలర్ బండారు గోవిందు కొత్త పింఛన్లను లబ్ధిదారులకు అందజేశారు. కొత్తగా మంజూరైన పింఛన్లను తొలిసారి అందుకుంటున్న అవ్వాతాతలు, వితంతవులు, దివ్యాంగుల ముఖాల్లో ఆనందం కనిపిస్తోంది. జగనన్న ఇస్తున్న పింఛన్ డబ్బులతో తమ జీవితాలకు ఇక ఓ చేయూత దొరికిందని వారు అంటున్నారు.

ఉప్పలగుప్తం: మండలంలోని ఉప్పలగుప్తం, మునిపల్లి గ్రామాలలో వైఎస్సార్ పింఛను కానుక పథకం ద్వారా నూతనంగా మంజూరైన పింఛన్లను ఆయా గ్రామాల సర్పంచులు బుధవారం అందజేశారు. ఉప్పలగుప్తంలో సర్పంచ్ కడిమి చిన్నవరాజు ఆధ్వర్యంలో 44 కొత్త పింఛన్లు అందించారు. మునిపల్లి సర్పంచ్ యర్రంశెట్టి రామచంద్రరావు 9 మంది లబ్ధిదారులకు వలంటీర్లతో ప్రతి ఇంటికి వెళ్లి నూతన పింఛన్లను అందించారు. ఈ కార్యక్రమంలో నిమ్మకాయల దొరబాబు, దుర్గారావు, త్రిమూర్తులు, పట్టా అప్పారావు, తోలేటి రామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పింఛన్లు

ఐ.పోలవరం: అర్హత ఉన్న ఏఒక్కరికీ సంక్షేమ పథకం అందలేదన్న మాట రాకూడదన్నది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పదేపదే అధికారులకు చెప్పేమాట, పాలనలో పారదర్శకత పాటిస్తూ సంక్షేమ, అభివృద్ధి విస్తరింపజేస్తున్నారని స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మండలంలో 418 మందికి మంజూరైన కొత్త పింఛన్లను జెడ్పీటీసీ ముదునూరి సతీష్ రాజు బుధవారం అందజేశారు. ఎంపీపీ మెర్ల రాణి మిరియం జ్యోతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో జెడ్పీటీసీ పాల్గొని మాట్లాడారు. మండలంలో లబ్ధిదారులకు జెడ్పీటీసీ ముదునూరి సతీష్‌రాజు, ఎంపీపీ రాణి మిరియం జ్యోతి, పార్టీ మండల కన్వీనర్ పిన్నంరాజు వెంకటపతిరాజు, దంతులూరి రాఘవరాజు, ఎంపీడీఓ డి.రాంబాబు, సర్పంచ్‌లు, సొసైటీ అధ్యక్షులు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు అందజేశారు.

ముమ్మిడివరంలో 467 మందికి..

ముమ్మిడివరం: ముమ్మిడివరం మండలం, నగర పంచాయతీ పరిధిలో నూతనంగా మంజూరైన 467 పింఛన్లను బుధవారం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ పింఛనుదారులకు అందజేశారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. ఎంపీపీ కోలా గంగా భవాని, నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, పెన్మెత్స చిట్టిరాజు, జెడ్పీటీసీ సభ్యులు కె.శివ శంకరరావు, మునికుమారి, పెయ్యాల చిట్టిబాబు, జగతా బాబ్జీ, వైస్ ఎంపీపీలు పి.నాగిణీ, మట్టపర్తి సురేష్, వైస్ చైర్మన్ కె.హేమసుందరి, బొంతు బుజ్జిబాబు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.



ఉప్పలగుప్తంలో లబ్ధిదారులకు పింఛన్లను అందజేస్తున్న సర్పంచ్ చిన్నవరాజు



అమలాపురంలో లబ్ధిదారులకు పింఛను అందజేస్తున్న నాయకుడు నాగేంద్ర



ఐ.పోలవరంలో కొత్త పింఛన్లు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ, ఎంపీపీ తదితరులు

క్రీడలతో మానసికోల్లాసం



పోటీలకు సిద్ధమైన విద్యార్థినులతో జెడ్పీటీసీ సంపదరావు తదితరులు

అల్లవరం: విద్యార్థులు చదువుతో పాటుగా ఆటలు ఆడి మానసిక ఉల్లాసాన్ని పొందాలని ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు అన్నారు. కొమరగిరిపట్నం ఉన్నత పాఠశాలలో హెచ్ఎం ఎంఎస్ఎన్ మూర్తి ఆధ్వర్యంలో బుధవారం స్కూల్ గేమ్స్‌ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ శేషగిరిరావు జాతీయ జెండాను, జెడ్పీటీసీ కొనుకు గౌతమి స్కూల్స్ గేమ్స్ జెండాను ఆవిష్కరించారు. అండర్ 14, 17 విభాగాల్లో వివిధ పాఠశాలలకు చెందిన క్రీడాకారులకు ఖోఖో, వాలీబాల్, కబడ్డీ, బాల్ బ్యాడ్మింటన్, షటిల్ బ్యాడ్మింటన్, త్రోబాల్, టెన్నికాయిట్, యోగా, అథ్లెటిక్స్ క్రీడలను నిర్వహించారు. రెండు రోజుల పాటు జరిగే మండల స్థాయిలో క్రీడల్లో ఉత్తమ ప్రదర్శన క్రీడాకారులను నియోజకవర్గ స్థాయిలో ఆడనున్నారని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్ ఎంపీపీ ముత్యాల వెంకటరామకృష్ణ, సర్పంచ్ రాకాపు విజయలక్ష్మి, ఎంపీటీసీలు పెచ్చెట్టి వెంకటేశ్వరరావు, కుడుపూడి శ్రీనివాసరావు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ పెనుమాల కనకదుర్గ భవాని, సర్పంచ్ బర్రె సీతారత్నం, ఎంపీటీసీ రాజేశ్వరీ, ఎంఈఓ కిరణ్‌బాబు, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం కార్యదర్శి ఉండ్రు ఎస్వీ ముసలయ్య, కోఆర్డినేటర్ రాము, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఆకుల దుర్గా ప్రసాద్, పీడీలు, పీఈటీలు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.



క్రీడలను ప్రారంభిస్తున్న ఎంపీపీ శేషగిరిరావు

బాలికలు క్రీడల్లో రాణించాలి

ఉప్పలగుప్తం: బాలికలు చదవుతో పాటు క్రీడల్లో రాణించి మంచి ప్రతిభలనుఎ సాధించాలని జెడ్పీటీసీ సభ్యుడు గెద్దం సంపదరావు అన్నారు. మండలంలోని భీమనపల్లి శిరంగు రంగనాయకమ్మ జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన మండల స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్ 14, అండర్ 17 బాలికల క్రీడా పోటీలను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు శిరంగు సత్తిరాజు, ఎమ్ఈవో-2 సత్తి సత్యకృష్ణ, వ్యాయామ ఉపాధ్యాయులు కామన మధుసూదనరావు, గొలకోటి ఫణి, విఘ్నేశ్వరుడు, సరస్వతి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగ పిల్లలకు ప్రత్యేక కౌన్సెలింగ్



దివ్యాంగ పిల్లలకు, వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తున్న స్వరూప్ చారిటబుల్ ఫౌండేషన్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి ప్రాంగణంలో ఉన్న డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్(డైస్)లో రాష్ట్రీయ బాలల స్వస్థత కార్యక్రమం (ఆర్‌బీఎస్‌కే) ఆధ్వర్యంలో పుట్టుక లోపాల పిల్లలకు వినికిడి సమస్యలపై రెండో రోజు బుధవారం కూడా ప్రత్యేక కౌన్సెలింగ్ జరిగింది. జిల్లాల్లో డైస్, ఆర్‌బీఎస్‌కే ద్వారా గుర్తించిన 90 మంది పుట్టుక లోపాల పిల్లలకు న్యూఢిల్లీ స్వరూప్ చారిటబుల్ ఫౌండేషన్ తొలిరోజు మంగళవారం వినికిడి యంత్రాలు ఉచితంగా అందించింది. ఈ రెండు రోజుల కార్యక్రమంలో తొలిరోజు ఆర్‌బీఎస్‌కే రాష్ట్ర నోడల్ అధికారి డాక్టర్ ప్రశాంత్ కుమార్ పాల్గొని పిల్లలకు వినికిడి పరికరాలను పంపిణీ చేశారు. స్వరూప్ ఫౌండేషన్ 90 మంది పిల్లలకు ఒక్కొక్కరికి రూ.15 వేల విలువైన వినికిడి పరకరాలు అమర్చడమే కాకుండా వాటిని రోజూ ఎలా అమర్చుకోవాలి, ఏయే సమయాల్లో వాడాలి వంటి సూచనలు, జాగ్రత్తలను ఆయా పిల్లలు, వారి తల్లిదండ్రులకు ప్రత్యేక కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆర్‌బీఎస్‌కే జిల్లా కో ఆర్డినేటర్, అమలాపురం డైస్ సెంటరు ఇన్‌చార్జి డాక్టర్ జాన్ లెవి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.శంకరరావు పాల్గొన్నారు. స్వరూప్ చారిటబుల్ ఫౌండేషన్ సంచాలకులు సురేష్ జె.పిల్‌లై, రవి శర్మ సురజీత్ పెయిన్, రాహుల్ సలేశలు పుట్టుక లోపాల పిల్లలకు వినికిడి పరికరాలు అమర్చి కౌన్సిలింగ్ ఇచ్చారు. వినికిడి పరికరాలు అందజేసిన న్యూఢిల్లీ స్వరూప్ చారిటబుల్ ఫౌండేషన్ బృందాన్ని డాక్టర్ శంకరరావు, డాక్టర్ జాన్‌లెవి అభినందించారు.

కుక్క స్వైర విహారం

- తొమ్మిది మందికి గాయాలు
- నూతన వరుడిపై దాడి



మహిళ చేతులపై కుక్కకాటు గాయాలు

యానాం: కనకాలపేట గ్రామంలో బుధవారం 9 మంది కుక్కకాటుకు గురయ్యారు. కుక్క స్వైర విహారం చేసి 9 మందిని గాయపరిచింది. తెలుపు రంగు కుక్క రోడ్డుపై వెళుతున్న వారిని కరవడంతో పలువురికి చేతులపైన, కాళ్లపైన కాట్లు పడడంతో వారిని యానాం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అదేవిధంగా నూతన వధూవరులు వివాహం చేసుకుని ఇంటికి వచ్చిన నేపథ్యంలో దారిలో కొత్త పెళ్లికొడుకు సైతం కుక్కకాటుకు గురయ్యాడు. దీనిపై అధికారులకు ఎన్ని సార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదన్నారు. తక్షణమే అధికారులు స్పందించాలని స్థానిక నాయకుడు కనకాల రాజు కోరారు.

దివ్యాంగుల సేవలో ఉమా మానసిక పాఠశాల



దివ్యాంగ విద్యార్థుల సమక్షంలో కేక్ కట్ చేస్తున్న దృశ్యం

యానాం: ఎన్నో ఏళ్ల నుంచి దివ్యాంగులకు వైద్యం, విద్యలో ఉమా ఎడ్యుకేషనల్ అండ్ టెక్నికల్ సొసైటీ అందిస్తున్న సేవలు అభినందనీయమని లయన్స్ క్లబ్ పిల్లారాయ అధ్యక్షుడు పులవర్తి శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక రాజీవ్‌బీచ్ రహదారిలో ఏర్పాటు చేసిన మానసిక దివ్యాంగుల పాఠశాల 35వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1988లో ఎస్‌పీ రెడ్డి ఆధ్వర్యంలో 8 మంది వికలాంగులతో మొదటి రాయుడుపాలెంలో స్థాపితమై పాఠశాల ఇప్పుడు యానాంలో సైతం దివ్యాంగ విద్యార్థులకు సేవలు అందిస్తూ అందరికీ ఆదర్శంగా నిలిచిందన్నారు. 16 రకాలైన దివ్యాంగుల అభివృద్ధికి అవసరమైన ప్రాజెక్టులను అమలు చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ ప్రతినిధులు చెక్కల అరుణ్‌కుమార్, ఎస్.శ్రీనివాస్, నాని, కె.సతీష్, సిబ్బంది కె.శ్రీనివాస్, తాతారావు, సుశీల, ఉదయకుమారి, మహేశ్వరీ, దివ్యాంగ విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తాళ్లరేవు: కోరంగి పంచాయతీ పరిధిలోని ధీరూబాయి అంబానీ ఎర్లీ ఇంటర్‌వెన్షన్ సెంటర్, ఉమా మనో వికాస కేంద్రం 36వ వ్యవస్థాపక దినోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి తాళ్లరేవు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు చోడే శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కేకును కట్ చేసి దివ్యాంగులకు పంచారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఇంఛార్జ్ ఎంవీ గోపాల్, ఎస్ఎం స్టీఫెన్, పి.సత్తిబాబు, డి.నాగమణి పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొని కారు బోల్తా

యానాం: యానాం బైపాస్ రోడ్డులో బుధవారం రాత్రి జరిగిన ప్రమాదంలో కారు బోల్తా పడింది. త్రుటిలో ప్రమాదం తప్పింది. అమలాపురం నుంచి కాకినాడ వైపు వెళుతున్న కారు యానాం బైపాస్ వద్దకు వచ్చే సరికి డివైడర్‌ను ఢీకొనడంతో కారు మూడు సార్లు పల్టీలు కొట్టి ఆగింది. స్థానికులు హుటాహుటిన వెళ్లి కారును సరైన విధానంలో పెట్టి అందులో ఉన్న వ్యక్తి డి.నాగుని బయటకు తీశారు. అతని తలకు గాయమవడంతో పోలీసులు యానాం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కారు ముందుభాగంతో పాటు పలుచోట్ల నుజ్జునుజ్జు అయ్యింది.

ఏపీ రొయ్య రైతుల సమాఖ్యలో ముగ్గురికి స్థానం

అమలాపురం టౌన్: ఆంధ్రప్రదేశ్ రొయ్య రైతుల సమాఖ్య నూతన కార్యవర్గంలో కోనసీమకు చెందిన ముగ్గురు ఆక్వా రైతులకు స్థానం లభించింది. ఏపీ ఆక్వా కల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ కో వైస్ చైర్మన్ వడ్డి రఘురామ్ సమక్షంలో విజయవాడలో మంగళవారం జరిగిన రాష్ట్ర రొయ్యల రైతుల సమావేశంలో ఆవిర్భవించిన ఆంధ్రప్రదేశ్ రొయ్య రైతుల సమాఖ్యలో కోనసీమకు సముచిత స్థానం లభించింది. జాతీయ రొయ్య రైతుల సమాఖ్యకు అనుబంధంగా ఏర్పాటైన ఈ రాష్ట్ర సమాఖ్య కమిటీ ఉపాధ్యక్షుడిగా అమలాపురానికి చెందిన మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు, సలహాదారుడిగా కాట్రేనికోన మండలం చెయ్యేరుకు చెందిన త్సవటపల్లి నాగభూషణ, కోశాధికారిగా అల్లవరం మండలం బెండమూర్లంకకు చెందిన యాళ్ల వెంకటానందం ఎన్నికయ్యారు. వీరి ఎంపికపై కోనసీమ ఆక్వా రైతుల హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన రుద్రరాజు నానిరాజు అమలాపురం మున్సిపల్ వైస్ చైర్మన్, జిల్లా శ్రీశ్రీ కళా వేదిక గౌరవాధ్యక్షుడు, వాకర్స్, యోగా ఆరోగ్య సంస్థ అధ్యక్షుడు కావడంతో మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు, జిల్లా శ్రీశ్రీ కళావేదికకు చెందిన కవులు, రచయితలు, వాకర్స్ క్లబ్‌ల ప్రతినిధులు ఆయనకు అభినందనలు తెలిపారు.

ఎమ్మెల్యేకు అభినందనలు



ఎమ్మెల్యేకు జ్ఞాపికను అందజేస్తున్న ఎల్జీ తమిళిసై సౌందరాజన్, చిత్రంలో సీఎం రంగసామి, స్పీకర్ సెల్వం

యానాం: దేశప్రధాని నరేంద్రమోదీ గత ఏడాది కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ ప్రవేశపెట్టిన 'టీబీ హారేగా భారత్ జీతెగా' కార్యక్రమంలో భాగంగా యానాం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఏడాది కాలం నుంచి తన సొంత ఖర్చులతో నెలకు 18 మంది టీబీ రోగులకు ప్రతినెలా పౌష్టికాహార కిట్లను పంపిణీ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయన చేస్తున్న కృషికి గుర్తింపుగా బుధవారం ఎల్జీ తమిళిసై సౌందరాజన్, సీఎం రంగసామి చేతుల మీదుగా ప్రశాంసా పత్రంతోపాటు, జ్ఞాపికను అందుకున్నారు. స్పీకర్ ఎంబ్లంసెల్వం, హోమ్‌మంత్రి నమశ్శివాయం, రాజ్యసభ సభ్యుడు సెల్వగణపతి, ఎమ్మెల్యేలు, మంత్రులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలపై సమీక్ష



అధికారులతో మాట్లాడుతున్న జేసీ నుపూర్ అజయ్

అమలాపురం రూరల్: స్థానిక కలెక్టరేట్ సమావేశ హాలులో జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్ అజయ్ జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాల పురోగతిపై గృహ నిర్మాణ సంస్థ ఇంజినీర్లతో బుధవారం సమీక్షించారు. గ్రామ సచివాలయ లేఅవుట్ల వారీగా ఇళ్ల నిర్మాణాల తీరుపై ఆరా తీసి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆమె మాట్లాడుతూ రానున్న వారంలో నిర్దేశించిన లక్ష్యాలను దిశగా చర్యలు చేపట్టాలన్నారు. ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేసేలా లబ్ధిదారులను చైతన్య పరచాలన్నారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు కావలసిన సపోర్టును గృహ నిర్మాణ సంస్థ ఇంజినీర్లు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గృహ నిర్మాణ సంస్థ పథక సంచాలకులు సీహెచ్ బాబూరావు, అధికారులు పాల్గొన్నారు.

రమేష్‌కు అంబేడ్కర్ ఫెలోషిప్ అవార్డు

తాళ్లరేవు: మండల దళిత యునైటెడ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు, హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ సెల్ జిల్లా వైస్ చైర్మన్ పెయ్యల రమేష్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఫెలోషిప్ అవార్డుకు ఎంపికయ్యారు. విశ్వజన కళామండలి అందించే ఈ అవార్డుకు రమేష్ ఎంపికైనట్టు కళామండలి జిల్లా అధ్యక్షుడు వడ్డి ఏడుకొండలు బుధవారం తెలిపారు. ఈ నెల 15వ తేదీన అమలాపురంలో జరిగే సంస్థ 45వ వార్షికోత్సవంలో ఈ అవార్డును ప్రదానం చేయనున్నట్టు తెలిపారు. తెలియజేసారు. అమలాపురంలోని అంబేడ్కర్ భవన్‌లో ఈ నెల 15వ తేదీన కళామండలి రాష్ట్ర అధ్యక్షుడు వడ్డి నాగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించే ఈ వార్షికోత్సవ వేడుకలకు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎస్పీ ఎస్.శ్రీధర్‌లు ముఖ్య అతిథులుగా హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు కళాకారులను, అభ్యుదయ వాదులను సత్కరించనున్నట్టు తెలిపారు.

రోడ్డుపై కూలిన వృక్షం



చెట్టు నేలకూలడంతో ధ్వంసమైన స్కూటీలు

అమలాపురం టౌన్: స్థానిక కాలేజీ రోడ్డులో సుబ్బారాయుడి చెరువు వద్ద రోడ్డు చెంతన ఉన్న 50 ఏళ్ల పై బడిన వృక్షం బుధవారం మధ్యాహ్నం నేల కూలింది. చెట్టు రోడ్డుపై కూలినప్పటికీ అక్కడ ఎవరూ లేకపోవడంతో త్రుటిలో ప్రమాదం తప్పింది. అయితే రోడ్డు చెంత పార్కు చేసి ఉన్న రెండు స్కూటీ వాహనాలు ధ్వంసమయ్యాయి. కొద్దిపాటి గాలులతోపాటు కాలం చెల్లడంతో ఆ వృక్షం నేల కూలింది. వృక్షం కూలి రోడ్డుపై పడడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. మున్సిపల్, పోలీసు సిబ్బంది, స్థానికులు సంయుక్తంగా గంట పాటు శ్రమించి నేల కూలిన వృక్షాన్ని తొలగించడంతో ట్రాఫిక్ సమస్య తీరింది.

ట్యాబ్‌ల పనితీరు పరిశీలన



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో కమలకుమారి

అమలాపురం రూరల్: ప్రభుత్వం ఎనిమిదో తరగతి విద్యార్థులకు ఇచ్చిన బైజూస్ ట్యాబ్‌ల పనితీరును పరిశీలించేందుకు అమలాపురం విద్యానిధి కాలేజీలో క్యాంపు నిర్వహించినట్లు డీఈవో కమల కుమారి తెలిపారు. ట్యాబ్‌ల వినియోగంలోను, వాటిలో ఏమైనా సమస్యలు ఉంటే ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు వెంటనే క్యాంపునకు వెళ్లి సమస్యలను పరిష్కరించుకోవచ్చన్నారు. ఏఈవో గుబ్బల సూర్య ప్రకాష్, ఎంఏకే బీమారావు తదితరులు పాల్గొన్నారు.

రేషన్‌కార్డు అర్హుల జాబితా విడుదల

యానాం: నియోజకవర్గ పరిధిలో డి డూప్లికేషన్ ప్రక్రియ, వివిధ ఎంక్వాయిరీల అనంతరం మొత్తం వివిధ రేషన్‌షాపుల పరిధిలో 2041 మంది అర్హులు ఉన్నట్టు గుర్తించినట్లు బుధవారం రీజినల్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ మునిస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. వీరందరి నివాస ధ్రువీకరణ పత్రం తదితర వాటిని తనిఖీ చేసి రేషన్‌షాపు వారీ తుది జాబితాను తయారుచేసినట్టు చెప్పారు. సంబంధితులు సివిల్ సప్లయిస్ శాఖ, యానాం అధికారులను సంప్రదించాలని, వారి పూర్తి వివరాలు తెలపాలని కోరారు.

వంద మందికి కంటి పరీక్షలు

ముమ్మిడివరం: చినకొత్తలంక గ్రామ సర్పంచ్ ఉమారాణి వర్మ సహకారంతో బుధవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో సుమారు వంద మందికి పరీక్షలు నిర్వహించారు. కిమ్స్ ఆస్పత్రి సౌజన్యంతో పీఎస్ఎన్ రాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక రామాలయం వద్ద జరిగిన శిబిరానికి విశేష స్పందన వచ్చింది. పరీక్షలు చేసి, మందులు అందజేసి, అవసరమైన వారికి ఉచిత ఆపరేషన్లు కూడా చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

కొబ్బరి రైతులను ఆదుకోవాలి

అమలాపురం రూరల్: కోనసీమ జిల్లాలో నాఫెడ్ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి కొబ్బరి కొనుగోలు పెంచాలని, కుటీర పరిశ్రమలను ప్రోత్సహించాలని రైతులు కోరారు. కోనసీమ భారతీయ కిసాన్ సంఘ్ కోననసీమ శాఖ ఆధ్వర్యంలో కొబ్బరి రైతులు ముత్యాల జమ్మిలు, బొక్కా ఆదినారాయణ, యాళ్ల వెంకటనందం, అడ్డాల గోపాలకృష్ణ, ఉప్పుగంటి భాస్కరరావు బుధవారం కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. అనంతరం కలెక్టర్ హిమాన్షు శుక్లాను కలిసి విజ్ఞప్తి చేశారు. నాఫెడ్ కొనుగోలు కేంద్రాలను తక్షణమే ఏర్పాటు చేసి కొబ్బరి రైతులను ఆదుకోవాలన్నారు. బోడకాయ కేజీ రూ.35 చొప్పున కొనుగోలు చేయాలన్నారు. పెట్టుబడులు పెరగడంతో నష్టాలను చవిచూస్తున్నామని, కొబ్బరికాయ ధర పెంచాలని కోరారు. కొబ్బరి రైతులు ప్రభుత్వం అదుకోవాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

అమలాపురం రూరల్: సమనస గ్రామంలో వైన్ షాప్ వద్ద అమలాపురం చల్లపల్లి ప్రధాన పంట కాలువలో గుర్తు తెలియని మృతదేహాన్ని గుర్తించినట్టు ఎస్సై అందే పరదేశి తెలిపారు. బుధవారం మధ్యాహ్నం సుమారు 2 గంటల సమయంలో స్థానికులు కాలువ నుంచి దుర్వాసన రావడంతో గమనించగా ఒక వ్యక్తి మృతదేహాన్ని గుర్తించారు. ఈ విషయాన్ని సమనస వీఆర్వో గణపతి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని కాలువ నుంచి వెలికి తీశారు. మృతుడి వివరాలు తెలియాలన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అందే పరదేశి తెలిపారు.

మురుగు కాలువలో పడి వ్యక్తి మృతి



సత్యనారాయణ (ఫైల్)

ఉప్పలగుప్తం: కూనవరం మేజర్ డ్రైన్‌లో పడి వ్యక్తి మృతి చెందాడు. దీనికి సంబంధించి స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కూనవరం గ్రామానికి చెందిన నల్లా వీర వెంకట సత్యనారాయణ(47) ప్రతి రోజులానే బహిర్భూమికి కాలువ గట్టుకు బుధవారం ఉదయం వెళ్లాడు. ప్రమాదవశాత్తు కాలు జారి డ్రైన్‌లో పడి మృతి చెందాడు. సాయంత్రం వేళలో స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. మృతునికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుమారుడు సాయిబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపారు.